క్లుప్తంగా

కాట్నపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని వినతి



మంత్రి ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎలిగేడు: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని కోరుతూ సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు, ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కరీంగనర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలిగేడు, జూలపల్లి, చొప్పదండి, సుల్తానాబాద్ మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్నందున ప్రయాణికుల సౌకర్యార్థం కాట్నపల్లిలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆపాలని కోరారు.

మత్స్య శాఖ అధికారితో వాగ్వాదం

పెద్దపల్లిరూరల్: పాలితం గ్రామంలోని పెద్ద చెరువు, పోతరాజు చెరువులో మాకు వాటా లేకుండా చేసి తీరని అన్యాయం చేస్తున్నారని, ఇది సరికాదంటూ పాలితం మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు జిల్లా మత్స్య శాఖ అధికారి భాస్కర్‌నాయక్‌తో వాగ్వాదానికి దిగారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన మత్స్యకార సంఘ నాయకులు ఎల్లయ్య, రామస్వామి, పెద్దలక్ష్మయ్య, శ్రావణ్‌కుమార్ తదితరులు తమకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇప్పించాలన్నారు. ఆయా చెరువుల్లోని రూ.20లక్షల విలువైన చేపలను గోపయ్యపల్లికి చెందిన నేరెళ్ల మొండయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య కుటుంబాలకు చెందినవారే మీ సహకారంతో లబ్ధి పొందారని ఆరోపించారు. మూడేళ్లుగా ఎన్నికలు జరపకుండా అడ్డుకుంటున్న వారికే వత్తాసు పలకడమేమిటని ప్రశ్నించారు. తాను చట్టబద్ధంగా వ్యవహరిస్తున్నానని, నిరాధారమైన ఆరోపణలు చేయొద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ అన్నారు. చట్టప్రకారం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రైవేట్ హాల్‌లో జరిగిన ఐక్య స్వచ్ఛంద సంఘాల సమావేశంలో రామగుండం నియోజకవర్గ స్వచ్ఛంద సంఘాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంచికట్ల దయాకర్, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల రమేశ్, ఉపాధ్యక్షులుగా గోలివాడ చంద్రకళ, సహాయ కార్యదర్శిగా ఎం.సంధ్యారెడ్డి, సీహెచ్ సంతోష్‌రెడ్డి, ట్రెజరర్‌గా మద్దెల దినేష్ ఎన్నికయ్యారు.

హనుమాన్ ఆలయ స్థలాన్ని కాపాడాలి

సుల్తానాబాద్: ఎంపీడీవో క్వార్టర్స్ వెనక వైపున్న హనుమాన్ ఆలయ స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే నిలుపుదల చేయాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి సోమవారం స్థానిక నాయకుడు రఫిక్ వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిని కోరారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి

సుల్తానాబాద్: ముదిరాజ్ కులాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ నాయకులు, మాజీ సర్పంచ్ బోయిని రాయమల్లు కోరారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీ–ఏగా మార్చారని, కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందన్నారు. నాయకులు గరిగంటి కుమార్‌బాబు, కుందేళ్ళ శ్రీనివాస్, ఐలవేణి వీరస్వామి, బోయిని వినోద్, గోపి పాల్గొన్నారు.

వ్యక్తికి మూడు రోజుల జైలు

గోదావరిఖని: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 27 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి సోమవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ ముందు హాజరుపర్చగా.. రూ.58వేలు జరిమానా విధించారు. రెండోసారి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన కొత్తకొండ శంకర్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ వెల్లడించారు.

విద్యార్థి సంఘాల నాయకులు అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ: నిరుద్యోగుల సమస్యలపై చేపట్టిన చలో సచివాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కాలనీలోని విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్‌ఎస్‌వీ పట్టణ అధ్యక్షుడు పులి రాకేశ్, తోకల రమేశ్‌లను సోమవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాధ్యతల స్వీకరణ

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఎస్సైగా సోమవారం కె.సతీశ్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీ ఎస్సైగా విధులు నిర్వహించిన ఉదయ్‌కిరణ్ ఇటీవల బదిలీ కావడంతో.. రామగుండం ఎస్సైగా విధులు నిర్వహించిన సతీష్ బాధ్యతలు చేపట్టారు.

వానాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



పాలితంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో గంగయ్య సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పాలితం గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్‌లకు పలు సూచనలు చేశారు.

సుల్తానాబాద్ రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. చిన్నకాల్వల గ్రామంలో పరిసర పరిశుభ్రత, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి నిస్సీక్రిస్టీనా అన్నారు. ర్యాకల్‌దేవుపల్లిలో శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. గ్రామ ప్రత్యేక అధికారి, ఏవో ఉమాపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ధూళికట్ట జీపీ కార్యాలయంలో నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఎంపీడీవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ప్రజలు, కాలనీవాసులు చుట్టుపక్కలున్న డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, గాజు సీసాలు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. పట్టణంలోని పలు కాలనీల డ్రైనేజీల్లో వేసిన ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాన్ని మున్సిపల్ కార్మికులతో తీయించారు.

ధర్మారం: శానిటేషన్ డ్రైవ్ వారోత్సవాల్లో భాగంగా మండలంలో చేపట్టిన శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సుష్మిత తెలిపారు.

ఓదెల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొలనూర్ డాక్టర్ శంజనేష్ సూచించారు. కొలనూర్ గ్రామంలో పరిసరాలను పరిశీలించారు.

జూలపల్లి: గ్రామాల్లో ప్రతి ఇంటి యజమాని పారిశుధ్య నిర్వహణకు శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. జూలపల్లిలో ఇంటింటా పారిశుధ్యంపై అవగాహనతోపాటు కుమ్మరికుంటలో వైద్యశిబిరం నిర్వహించారు.

ఆటపాటలతో అక్షర జ్ఞానం



పెద్దపల్లిరూరల్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో కవిత



రామగుండం: చిన్నారుల ర్యాలీ

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో అక్షర జ్ఞానం అందిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పెద్దపల్లి సీడీపీవో కవిత అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. సూపర్‌వైజర్ ప్రేమలత, ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు రజిత, రమాదేవి, మెహరున్నిసా, స్వప్న, రేఖ, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ బాట నిర్వహించారు. చిన్నారులు ప్లకార్డులు పట్టుకోగా.. వారి వెంట మండల సూపర్‌వైజర్ అంజలి ఇంటింటా పర్యటించారు. ఆదర్శ అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమలమ్మ, భారతి, కవితారాణి తదితరులున్నారు.

ఎలిగేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చేపట్టిన ప్రీస్కూల్ విద్యతోనే చిన్నారుల విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకళ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1 ఆధ్వర్యంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశ కార్యకర్త పద్మ, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

జూలపల్లి: గ్రామాల్లో మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో సంపద కుమారి తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ లక్ష్మి, టీచర్లు శైలజ, అలేఖ్య, ఉమారాణి, నర్సమ్మ, సత్య, ఏఎన్‌ఎం విజయ పాల్గొన్నారు.

గోదావరిఖనిటౌన్: 33వ డివిజన్‌లో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీడీపీవో స్వరూపారాణి, ప్రభుత్వ పాఠశాల టీచర్లు సమ్మయ్య, సరిత, సంగీత, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మీ, నిర్మల, శ్రీలత, శ్రీమాల తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ రామగుండం అర్బన్ సీడీపీవో ఆదేశాల మేరకు మాతంగికాలనీలో పద్మ, సుజాత, స్వప్న ఆధ్వర్యంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీ లలిత, శారద, పి.ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకే కావాలి



నినాదాలు చేస్తున్న మొగల్‌పహాడ్ గ్రామస్తులు

రామగుండం: ఎన్టీపీసీ నూతన విద్యుత్ కేంద్రం స్థాపనలో భాగంగా బూడిద చెరువు ఏర్పాటు నిమిత్తం సర్వే చేపట్టిన సదరు భూములు తమకే దక్కాలంటూ సోమవారం మొగల్‌పహాడ్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. 1982లో ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం స్థాపన సమయంలోనే కోల్పోయిన భూములకు సరైన నష్ట పరిహారం పొందలేక, కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అప్పుడే ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ తమ భూములు సేకరించి మోసం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మిగులు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న క్రమంలో సదరు భూములను సైతం సేకరించేందుకు సర్వే సస్థ చేపట్టిందని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకొని గతంలోనే నష్టపోయిన నిర్వాసితులకు పరిహారం ఇప్పించాలని, మిగులు భూములకు తమ పేరుతో పట్టాలు ఇప్పించాలని కోరారు.

క్వార్టర్ల కేటాయింపు

గోదావరిఖని: సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. శివాజీనగర్, హనుమాన్‌నగర్, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న కార్మికుల కోసం కౌన్సెలింగ్ చేపట్టారు. రోడ్డు విస్తరణలో క్వార్టర్లను తొలగించనున్న నేపథ్యంలో వారికి వేరే ప్రాంతంలో క్వార్టర్లు కేటాయించేందుకు ఈ కౌన్సెలింగ్ జరిపారు. కార్యక్రమంలో హౌజ్ అలాట్‌మెంట్ కమిటీ సభ్యులు రామ్మోహన్, ప్రభాకర్, హనుమంతరావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

క్వార్టర్లకు విద్యుత్ పునరుద్ధరించాలి

గోదావరిఖని: రోడ్డు విస్తరణలో కోల్పోనున్న క్వార్టర్లకు తొలగించిన విద్యుత్ కనెక్షన్ వెంటనే పునరుద్ధరించాలని హైకోర్టు సోమవారం సూచించింది. సింగరేణి యాజమాన్యం తీరును వ్యతిరేకిస్తూ గంపల సమ్మయ్యతోపాటు 26 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన జడ్జి వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. పలు సూచనలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది. కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడకుండా అక్కడ ఉన్న కార్మికులకు వేరే ప్రాంతంలో క్వార్టర్లను కేటాయించాలని కోరారు. తహసీల్దార్ సమక్షంలో మంచి క్వార్టర్లను వారికి అప్పగించాలని సూచించారు. ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం స్పందించి ఆదేశాలు అమలు చేయాలని కోరింది. ఈ కేసును తిరిగి ఈనెల 30కి వాయిదా వేశారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక అసోసియేషన్ ఫొటో భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి డీవీఆర్ తులసి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28ల్లో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరగనుందని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శనగరపు మల్లేశ్, కోశాధికారి బండారి ప్రసాద్, తోగటి శ్రీధర్, దుస్స మహేశ్, రామగిరి శ్రీనివాస్, రెడ్డి శ్యాంప్రసాద్, కోడి రామకృష్ణ, రెడ్డి రోజారాణి, కుడిక్యాల శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళలకు భద్రత కరువు



కరపత్రం ఆవిష్కరిస్తున్న జ్యోతి తదితరులు

రామగుండం: సమాజంలో మహిళలకు భద్రత లేకుండా పోతుందని, అఘాయిత్యాలు, హిందూ మతోన్మాదం, కులం పేరుతో ప్రభుత్వాలు అణచివేతకు గురి చేస్తున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి అన్నారు. ఈనెల 28న నిర్వహించే ఏడవ మహాసభ కరపత్రాన్ని సోమవారం పెద్దంపేటలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఆకాశంలో సగం– భూమి మీద సగం అనే నినాదంపై పోరాడుతున్న మహిళల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. గ్రామ అధ్యక్షురాలు కోడిపుంజుల స్వరూప అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్తమ్మ, మేర్గు పద్మ, మంద దుర్గమ్మ, ఎడవెల్లి సంధ్యారాణి, నాడెం రాజక్క, నల్లతీగల రాజక్క, కోడిపుంజుల స్వప్న, కొదురుపాక స్వరూప, గుజ్జుల రమాదేవి, బొడ్డుపల్లి మధునమ్మ, కొనన రాజక్క, శంకరమ్మ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

రక్తదానానికి ముందుకు రావాలి

పెద్దపల్లిరూరల్: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ అన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈఈలు పరిశీలించారు.

రోడ్లపై చెత్తాచెదారం కనిపించొద్దు

పెద్దపల్లిరూరల్: ఇళ్ల మధ్య, రోడ్లపై చెత్తాచెదారం నిల్వలను ఉంచొద్దని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ వ్యాపారులను ఆదేశించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గోదావరిఖనిటౌన్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌పై వన్‌టౌన్ పోలీసులు తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని న్యాయవాదులు విధులను బహిష్కరించారు.

తప్పులుంటే సరిచేసుకోవాలి

కమాన్‌పూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం వర్తించని వారు ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి తప్పులను సరిచేయించుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్(హెచ్‌ఆర్‌డీ) అశోక్‌కుమార్ సూచించారు.

పురాణాల్లోనూ గోరింటాకుకు ప్రత్యేక స్థానం

గోదావరిఖనిటౌన్: పురాణాల్లోనూ గోరింటాకుకు ప్రత్యేకమైన స్థానం ఉందని బీజేపీ రామగుండం మండల ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

జూలపల్లి: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాచాపూర్ నుంచి నిట్టూరు వరకు రూ.12కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి

మంథని: ఉమ్మడి జిల్లా నుంచి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మంథనికి చెందిన విద్యార్థులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభినందించారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

గోదావరిఖని: రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించాలని కోరుతూ ఈనెల 18న నిర్వహించే చలో హైదరాబాద్‌కు పెద్దసంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు.

దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సుల్తానాబాద్: దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందిస్తున్నామని శ్రీవాణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కమలాకర్ తెలిపారు. పదోతరగతి పూర్తి చేసి సదరెం సర్టిఫికెట్ గల విద్యార్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో హాస్టల్‌తో కూడిన ఉచిత శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని, సుల్తానాబాద్‌లోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. గణ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌డీ, ఎస్సీపీడబ్ల్యూడీ సహకారంతో రెండు కోర్సుల్లో రెండు నెలల ఉచిత శిక్షణ, ఉచిత హాస్టల్ వసతి, రూ.5,000 స్కాలర్‌షిప్, ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.

మేజిక్ రాజాకు విశిష్ట మెజీషియన్ అవార్డు

గోదావరిఖనిటౌన్/కోల్‌సిటీ: ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన 40వ ఇంద్రజాల మహోత్సవం అమరావతి మేజిక్ ఫెస్టివల్‌లో భాగంగా గోదావరిఖనికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు మేజిక్ రాజాకు అసోసియేషన్ నిర్వాహకులు విశిష్ట మెజీషియన్ అవార్డును ప్రదానం చేశారు. 42 సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో ఇంద్రజాలం, మిమిక్రీ, వెంట్రిలాక్విజం ప్రదర్శనలతోపాటు వ్యాఖ్యాతగా, కవిగా, రచయితగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్న మేజిక్ రాజాను గుర్తించి అవార్డును అందజేశారు.

ఎన్పీడీసీఎల్ పరిధిలో పెద్దపల్లి సర్కిల్‌కు అగ్రస్థానం

పెద్దపల్లిరూరల్: ఎన్పీడీసీఎల్ పరిధిలో మెరుగైన విద్యుత్ సరఫరా చేయడంలో పెద్దపల్లి సర్కిల్ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఏప్రిల్‌లో అగ్రస్థానంలో నిలిచిన పెద్దపల్లి మే నెల ర్యాంకింగ్‌లో మొదటి ర్యాంకును పదిలపర్చుకుంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రసంగిస్తున్న డా.సుమన్

గోదావరిఖని: సీజనల్ వ్యాధుల పట్ల కార్మిక కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–1 ఏరియా ఆరోగ్య అధికారి డాక్టర్ ఎన్.సుమన్ సూచించారు. సోమవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈసందర్భంగా కాంట్రాక్టు కార్మికులకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుడా చూసుకోవాలన్నారు. వర్షంలో వెళ్లాల్సి వచ్చినప్పుడు రెయిన్ కోట్ లేదా గొడుగు వాడాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, బీన్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. గని మేనేజర్ నెహ్రూ, మల్లేశం, రాకేశ్, రవీందర్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లు



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

గోదావరిఖని: సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్‌కు పలువురు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారు. స్థానిక సింగరేణి అధికారులతో కుమ్మక్కై తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన సమస్య పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసినవారిలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్లు సతీశ్ కుమార్, సతీశ్, నరేందర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ జనరల్ సెక్రెటరీ కనకయ్య, గఫూర్ తదితరులున్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బుర్ర తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కన్వీన్స్ వెహికల్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా సీహెచ్‌పీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ డ్రైవర్లు కృషి భవన్‌లో చేపట్టిన సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్ట్ డ్రైవర్లకు చట్టపరమైన హక్కులు, సీఎంపీఎఫ్ బోనస్, స్కిల్డ్ వేతనాలు, అన్ని రకాల వైద్య సౌకర్యాలతో పాటు 26 రోజుల పని దినాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఆర్జీ–2 కార్యదర్శి జిగురు రవీందర్, రాజారత్నం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అందుబాటులో ఎరువులు



పీఏసీఎస్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో ప్రమోద్



జూలపల్లిలోని సహకార సంఘ గోదాంలో ఎరువుల వివరాలు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి ప్రత్యూష

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అందించడానికి యూరియా, డీఏపీతోపాటు పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలోని ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎరువులు తీసుకునే రైతులు నేరుగా ఆధార్ కార్డు వెంట తీసుకొని కార్యాలయానికి వచ్చి సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్‌ను కలవాలని సూచించారు.

జూలపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలతోపాటు ఎరువులను అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి ఎరువుల దుకాణంలో రికార్డులు నిర్వహించాలని, రైతులకు బిల్లులివ్వాలన్నారు. సంఘ సీఈవో సురేష్, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన



ఎలిగేడులో కళాజాత ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

ఎలిగేడు: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారుల కళాప్రదర్శన సోమవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆకట్టుకుంది. కళాకారుల టీం లీడర్ ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, కళాకారులు గుండ్ల స్నేహలత, సలేంద్ర రాజన్న, మంథని వెంకటస్వామి, సాయిల్ల శ్రీనివాస్, జక్కుల స్వప్న, కట్కూరి శ్రీవల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరీల సందడి

జ్యోతినగర్: సోమవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ గ్రామంలో పీరీలను ఊరేగించారు. భక్తులు పీరీలకు దట్టీలతోపాటు కుడుకలు, దండలు వేసి పూజలు చేశారు.

కమాన్‌పూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. ఈనెల 17న మొహర్రం(పీరీల పండుగ)ను పురస్కరించుకొని సోమవారం పీరీలను ఊరేగించారు.

ఓదెల: కొలనూర్, కనగర్తి, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లో పీరీలు ఊరేగించారు. గుండం చుట్టు తిరుగుతూ పీరీలను పడుకోబెట్టారు.



గుండారంలో..



జ్యోతినగర్: పీరీలను ఊరేగిస్తున్న భక్తులు